క్లుప్తంగా

కోటగిరిలో బస్టాండ్ నిర్మించాలి



రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కోటగిరి మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బస్టాండ్ లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా మూత్రశాలలు లేనందున మహిళలు అవస్థలు పడుతున్నారు. గతంలో పలుమార్లు అధికారులు విన్నవించినప్పటికి ఫలితం లేదని వాపోయారు. సమస్య పరిష్కరించనట్టయితే దశల వారీగా ఉద్యమం చేపడుతామని వారు హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్, పార్టీ నాయకులు నల్ల గంగాధర్, గుడాల వీరేశం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విఠల్ సేవలు అభినందనీయం



రుద్రూర్: పోలీస్ వృత్తిలో విఠల్ అందించిన సేవలు అభినందనీయమని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తూ పదవి విరమణ చేసిన విఠల్‌ను ఆదివారం రుద్రూర్ పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సై సాయన్న, ఏఎస్సై రాజు,హెడ్ కానిస్టేబుల్ సురేష్, సాగర్, ప్రదీప్, అమీర్, రాజు, గణపతి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా మొరం అక్రమ రవాణా

రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్ శివారులో గుట్ట ప్రాంతం నుంచి అక్రమార్కులు రాత్రి మొరం వేళ తరలిస్తున్నారు. జేసీబీల ద్వారా తవ్వకాలు జరిపి ప్రైవేటుగా మొరం అమ్మకాలు జరుపుతున్నారు. మొరం అక్రమ రవాణాపై ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నాయి. ఇందుకోసం సాయంత్రం వరకు మొరం తరలించుకోవడానికి అవకాశం ఉన్నా.. రాత్రి వేళ తరలించడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై రెవెన్యూ, మైనింగ్ అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించగా వారు స్పందించలేదు.

ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వేణురాజ్



వేణురాజ్

నిజామాబాద్ అర్బన్ : రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శిగా నగరానికి చెందిన వేణురాజ్ నియమితులయ్యారు. ప్రస్తుతం వేణురాజ్ ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. ఈసందర్భంగా వేణురాజ్ మాట్లాడుతు గత ఏడు సంవత్సరాలుగా ఎన్ఎస్‌యూఐలో కష్టపడినందుకు రాష్ట్ర నాయకులు గుర్తించడం సంతోషంగా ఉందన్నారు. ఈనియామకంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక



మమత

సిరికొండ: జాతీయ స్థాయి హాకీ పోటీలకు తూంపల్లి క్రీడాకారిణి మాలావత్ మమత ఎంపికైనట్లు జెడ్పీహెచ్ఎస్ పీడీ నగేష్ తెలిపారు. గత నెలలో జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించిన సీనియర్ నేషనల్స్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. జాతీయ స్థాయి పోటీలు ఈ నెల 10 వరకు హర్యానాలో జరుగుతాయని ఆయన తెలిపారు. సాయ్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మమత జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడంపై జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి, కార్యదర్శి రమణ, వీడీసీ, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

దుద్దిళ్ల శ్రీపాదరావుకు ఘన నివాళి

నిజామాబాద్ రూరల్: ఉమ్మడి ఏపీ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని ఆదివారం జెడ్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సీఈవో సాయాగౌడ్ ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉప ముఖ్య కార్యనిర్వాహణ అధికారి సాయన్న, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు నిధులు మంజూరు

- శిథిలావస్థకు చేరిన అయిలాపూర్ ఎస్సీ హాస్టల్ భవనం
- ఇటీవల అసెంబ్లీలో సమస్యను ప్రస్తావించిన ఎమ్మెల్యే
- రూ. 2.45 కోట్లు విడుదల చేసిన సర్కారు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



అయిలాపూర్ ఎస్సీ హాస్టల్ భవనం

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని అయిలాపూర్ నూతన ఎస్సీ హాస్టల్ భవనం నిర్మాణానికి ప్రభుత్వం ఎట్టకేలకు రూ.2.45 కోట్లు విడుదల చేసింది. ఎస్సీ బాలుర హాస్టల్ శిథిలావస్థకు చేరింది. ఈహాస్టల్‌లో విద్యార్థులు పడుతున్న ఇబ్బందుల వార్తను సాక్షి పలు మార్లు ప్రచురించింది. అయిలాపూర్ గ్రామానికి వచ్చినప్పుడు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి హాస్టల్ భవనాన్ని చూసి చలించిపోయారు. స్లాబ్ పెచ్చులూడి ఇనుప చువ్వలు తప్పు పట్టాయి. ఇలాంటి వసతి గృహంలో పిల్లలు చదువుకుంటున్నారని బాధని వ్యక్తం చేశారు. కాగా, హాస్టల్‌ను 1974లో నిర్మించారు.

అసెంబ్లీలో ప్రస్తావన..

మండలంలోని అయిలాపూర్ ప్రభుత్వం వసతి గృహం శిథిలావస్థకు చేరుకున్న విషయాన్ని రాష్ట్ర శాసన సభ సమావేశంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ప్రస్తావించారు. ఏళ్ల క్రితం నిర్మించిన వసతి గృహం శిథిలావస్థకు చేరింది. విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధలను ప్రస్తావించారు. ఈవిషయాన్ని అందరికి వీడియో ద్వారా తెలియజేశారు. వెంటనే నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనమంతు వసతి గృహాన్ని సందర్శించి వాస్తవిక నివేదికను ప్రభుత్వానికి పంపారు. గతనెల 24న జీవో 59 ప్రకారం అయిలాపూర్ నూతన ఎస్సీ హాస్టల్ భవనం నిర్మాణానికి రూ.2.45 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈమేరకు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ జీవో కాపీని విడుదల చేశారు. దీంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



రాష్ట్ర ప్రభుత్వం అయిలాపూర్ నూతన ఎస్సీ హాస్టల్ భవనం నిర్మాణానికి రూ. 2.45 కోట్లు మంజూరు చేస్తూ జీవో విడుదల చేయడంపై ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల వసతి గృహానికి నిధులు మంజూరు చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలో ఉన్న మిగతా వసతి గృహాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. – పైడి రాకేష్‌రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే

ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలి



ఇందూర్ హైస్కూల్ కరస్పాండెంట్ కొడాలి కిషోర్ దంపతులను సన్మానిస్తున్న ఎంఈవో



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన

బోధన్: ప్రతి విద్యార్థి ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలని బోధన్ ఎంఈవో నాగయ్య అన్నారు. పట్టుదల, క్రమశిక్షణ, కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. శనివారం రాత్రి నిర్వహించిన పట్టణంలో ఇందూర్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. లయన్స్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపకులు పోలవరపు బసవేశ్వర్‌రావు మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి వివిధ రంగాల్లో దేశ, విదేశాల్లో స్థిరపడ్డారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్,ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్ దంపతులను అతిథులు ఘనంగా సన్మానించారు. లయన్స్ కంటి ఆస్పత్రి చైర్మన్ నర్సింహారెడ్డి, సివిల్ సర్జన్ డాక్టర్ భూమారెడ్డి, ట్రస్మా పట్టణ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో ఫేర్ వెల్ డే

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నారాయణ పాఠశాలలో ఫేర్‌వెల్ డే సెలబ్రేషన్స్ ఆదివారం ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ రజని కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తొమ్మిదవ తరగతి విద్యార్థులు, పదవ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు.కార్యాక్రమంలోఉపాధ్యాయులు గోపాల్ రెడ్డి, రమణ రెడ్డి, నరేష్, అజీమా, కల్పనా, నవీన్, సందీప్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మి కాలువ భూముల ఆక్రమణ

- ఇరిగేషన్ భూమిని కబ్జా చేసిన మాజీ సర్పంచ్
- ప్రభుత్వ భూమిలో మడిగెల నిర్మాణం
- అధికారులు పట్టించుకోవడం లేదు
- బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ ఆరోపణ



ముప్కాల్‌లో మాట్లాడుతున్న సంతోష్

బాల్కొండ: ముప్కాల్‌లో లక్ష్మి కాలువకు సంబంధించిన భూములను మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్ కబ్జా చేసి మడిగెలు నిర్మించాడని బీజేవైం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకుడు సంతోష్ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే నంబరు 70/1, 70/2,70/3 లో గల లక్ష్మి కాలువకు సంబంధించిన ఇరిగేషన్ భూమిలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్ అక్రమంగా మడిగెలు నిర్మిస్తున్నారని మండిపడ్డారు. ఈవిషయమై స్టే ఆర్డర్ తెచ్చుకొని కోర్టును తప్పుదోవ పట్టించాడని విమర్శించారు. అక్రమంగా నిర్మించిన మడిగెలను తొలగించవద్దని స్టే ఆర్డర్‌లో కోర్టు ఎక్కడ పేర్కొనలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి అండతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులపై బెదిరింపులకు పాల్పడుతున్నాడని అన్నారు. మాజీ సర్పంచ్ నూతనంగా నిర్మించిన మణికంఠ ఫంక్షన్ హాల్‌కు సైతం ఎలాంటి అనుమతులు లేవన్నారు. ఫంక్షన్ హాల్ వ్యర్థాలను ప్రభుత్వ భూమిల్లోనే వేస్తున్నాడన్నారు. అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించకుంటే భవిష్యత్తులో అధికారులపై చర్యలు తీసుకోనేలా కోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. ముప్కాల్‌లో భూ కబ్జాలను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు.

మోచి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన మోచి సంఘం సభ్యులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రాష్ట్ర మోచి సంఘం అధ్యక్షుడు కొండ్లపు ముత్యం అధ్యక్షతన మోచి సంఘం నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు ఓటరికారి గంగాధర్, ప్రధాన కార్యదర్శి కొండ్లెపు సుధాకర్, కోశాధికారి కొండ్లెపు సాయిలు, సంయుక్త కార్యదర్శి ప్రవీణ్, సభ్యులుగా రాచర్ల రాజేంద్రప్రసాద్, కొండ్లెపు రాజు, బైరి ఓమ్ ప్రకాష్, రాజు, శేఖర్, సింది స్వామి, బైరి రవి, రాజన్న, ఓ లక్ష్మణ్, ఓ సాయిలు, పురుషోత్తంలు నియమితులైయ్యారు. ఈ సందర్భంగా ముత్యం మాట్లాడుతూ, మోచిల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా నూతన కార్యవర్గం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మోచిలు సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆయన పేర్కొన్నారు. మోచిలను బీ కేటగిరీలో చేర్చినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆ కేటగిరికి కేటాయించిన 9% రిజర్వేషన్లను 12% వరకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఇంటి పన్ను వసూలు



పట్టణంలో ఇంటి పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఆదివారం మున్సిపల్ శాఖ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ ఆస్తి పన్ను వసూలు చేశారు. ఇంటి పన్ను చెల్లించినపుడే కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టడం సాధ్యమవుతుందని ప్రజలకు అవగాహన కల్పిస్తూ పన్ను వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ అధికారులు ఎల్ శేఖర్, ఎస్ దత్తా రెడ్డి, వెంకటేష్, పీ నాగరాజు, ఏ నర్సయ్య, భాను, శ్రీకాంత్, సిందూజ, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉమామహేశ్వరస్వామి రథోత్సవం



ఉమామహేశ్వర ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్తున్న పురోహితులు



రథోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

ఎడపల్లి(బోధన్): మండలంలోని కుర్నాపల్లి ఉమా మహేశ్వర ఆలయంలో ఆదివారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు పోటీపడి రథాన్ని లాగారు. రథాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులు పూలు, మామిడి తోరణాలతో పాటు ప్రత్యేక విద్యుత్తు అలంకరణతో అందంగా అలంకరించారు. గ్రామంలోని ప్రధాన వీధులలో ఉమామహేశ్వర రథోత్సవం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సురేందర్ రెడ్డి, గ్రామపెద్దలు రవీందర్ గౌడ్, అనిల్ రెడ్డి, హన్మంత్ రెడ్డి, పరిగే సాయిలు , సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐ టెక్నాలజీపై అవగాహన



విషయాలను వివరిస్తున్న ఈడోస్ సంస్థ సీఈవో లక్ష్మీ కాంత్

పెర్కిట్(ఆర్మూర్): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శ్రీ భాషిత పాఠశాలలో ఆదివారం కృత్రిమ మేధస్సు ద్వారా విద్యాభ్యాసంపై విద్యార్థుల తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సైన్సు అధికారి గంగాకిషన్, ఈడోస్ సంస్థ సీఈవో లక్ష్మీ కాంత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు ద్వారా విద్యార్థులు పాఠ్యంశాలను విజులైజేషన్ చేసినపుడు ఎల్లకాలం గుర్తిండిపోతాయన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీ భాషిత సుందర్, ఉపాధ్యాయునులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లి తండా గ్రామంలో ఆదివారం జూనియర్ ఛాంబర్ అఫ్ ఇంటర్నేషనల్ ఇందూరు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు నాగేందర్ ఆధ్వర్యంలో 73 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 13 మందికి మోతిబిందు ఉన్నట్లు గుర్తించారు.

అధ్యాత్మికం

■ భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి జాతర



వేల్పూర్: మండల కేంద్రంలో ఆదివారం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జాతర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక విశ్వబ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో పుజారులు హోమం, అభిషేకం నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం జరిపించారు. జాతరకు వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం నిర్వహించిన రథోత్సవం కనుల పండువగా జరిగింది. విశ్వబ్రాహ్మణసంఘం సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

■ నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

■ గ్రామానికి చేరిన రాజరాజేశ్వరస్వామి

వేల్పూర్: మండలంలోని మోతె గ్రామంలో శనివారం రాజరాజేశ్వరస్వామి జాతర జరుగగా, ఉత్సవ మూర్తులను ఆదివారం గ్రామంలోని ఆలయానికి డప్పువాయిద్యాలతో తీసుకువచ్చారు. గ్రామానికి దూరంగా ఉన్న మోతె గుట్ట వద్ద గల రాజరాజేశ్వర ఆలయం వద్ద ప్రతి ఏటా శివరాత్రి తర్వాత మూడు రోజులకు జాతర జరగడం ఆనవాయితీగా వస్తోంది. జాతర రోజు రాత్రి ఉత్సవమూర్తులను ఆలయంలో ఉంచుతారు. మరుసటిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించి, పల్లకీలో గ్రామంలోని ఆలయానికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	ఛావా(హిందీ)-10.15, శబ్దం (తెలుగు) -1.35, సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు) -4.40, అగత్యా(తెలుగు)-7.50, రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.40
స్క్రీన్-2	శబ్దం(తెలుగు)-10.05, ఛావా (హిందీ) -1.10, 7.35, 10.55, మజాకా (తెలుగు) -4.30
స్క్రీన్-3-	రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.10, మజాకా(తెలుగు)-1.20, గ్యాంగ్స్ ఆఫ్ వేస్ పూర్(హిందీ)-4.25, శబ్దం(తెలుగు)-7.40, 10.45
స్క్రీన్-4	నేనెక్కడున్నా(తెలుగు)-10.45, గార్డ్(తెలుగు)-1.25, ఛావా(హిందీ)-4.00, రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-7.20, మజాకా(తెలుగు)-10.30

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఛావా(హిందీ)-11.00, 4.40, 7.30, 10.20, అగత్యా(తెలుగు)-1.40
స్క్రీన్-2	అగత్యా(తెలుగు)-11.00, 4.40, మజాకా (తెలుగు) - 1.45, 7.35, 10.30
స్క్రీన్-3	గార్డ్(తెలుగు)-10.50, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్(తెలుగు)-1.40, 7.30, శబ్దం (తెలుగు)-4.40, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఛావా(హిందీ)-10.05, మజాకా (తెలుగు) - 1.25, టర్న్ ఆఫ్‌ది డ్రాగన్ (తెలుగు)-4.30, 7.40, 10.50
స్క్రీన్-2	నందీప్‌కిషన్ మజాకా(తెలుగు)- 10.00, 4.15, రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-1.05, ఛావా(హిందీ)-7.20, 10.40
స్క్రీన్-3	రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-9.40, ఛావా(హిందీ)-12.50, తండేల్(తెలుగు) - 4.10, 10.20, మజాకా(తెలుగు) - 7.15
స్క్రీన్ -4	ఓయ్(తెలుగు)-10.05, జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-1.30, ఛావా(హిందీ)-4.20, సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)- 7.40, మజాకా(తెలుగు)-10.40
లలితామహల్	తండేల్
దేవి	మజాకా
నటరాజ్	ఛావా(హిందీ)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	130
	(కిలోకు)	లైవ్	80
స్కిన్‌లెస్	150	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	88,200	వెండి(కిలో)	1,00,500
22 క్యారెట్స్	81,900		

– నిజామాబాద్ బిజినెస్

లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాలి



మాట్లాడుతున్న లయన్స్ జిల్లా గవర్నర్ నగేష్

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాలని లయన్స్ జిల్లా గవర్నర్ పంపటి నగేష్ అన్నారు. నగర శివారులోని కమ్మసంఘ భవనంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ 62వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లయన్స్ సేవలను మరింతగా విస్తరించాలని సూచించారు. కొత్త వారిని తీసుకువచ్చి సేవా కార్యక్రమాల్లో మమేకం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ డి.నర్సింహరాజు, లయన్స్ పూర్వ గవర్నర్లు ప్రకాష్ రావు, లక్ష్మి, పెంటయ్య, బసవేశ్వర రావు, గందాని శ్రీనివాసరావు, ఓబుల్ రెడ్డి, వీటీ రాజ్ కుమార్, వీరేశం, జిల్లా కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి మధు, లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ అధ్యక్ష కార్యదర్శులు అవన్ కుమార్, శంకర్, కోశాధికారి జయంత్, రీజియన్ చైర్మన్ అనిల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన డబుల్‌రోడ్డు నిర్మాణం



కొత్తపల్లి నుంచి పచ్చలనడ్కుడకు వేసిన రోడ్డు

- తీరనున్న ప్రజల కష్టాలు

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ నుంచి కొత్తపల్లి ఎస్ మీదుగా చింతలూరు క్రాస్‌రోడ్డు వరకు డబుల్‌రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో ఆ గ్రామాల ప్రజలకు రహదారి కష్టాలు తీరాయి. సుమారు ఆరున్నర కిలోమీటర్ల దూరమున్న ఈ రహదారికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రెండేళ్ల కింద సుమారు రూ. 9 కోట్లు మంజూరు చేయించారు. కాంట్రాక్టరు గత ఏడాది పనులు ప్రారంభించి ఇటీవల రహదారి నిర్మాణం పూర్తి చేశారు. కొత్తపల్లి గ్రామస్తులు పచ్చలనడ్కు మీదుగా మండల కేంద్రమైన వేల్పూర్‌కు, ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి, చింతలూరు వైపు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లడానికి మార్గం సుగమమైంది. నడ్కుడ గ్రామస్తులు సైతం తమ పంట భూములకు వెళ్లడానికి, చింతలూరు గ్రామస్తులు వేల్పూర్ మండల గ్రామాలకు ప్రయాణించడానికి మార్గం సులువైంది. డబుల్ రోడ్డు నిర్మాణంతో సాధారణ ప్రయాణానికి, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు రహదారి కష్టాలు తీరాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నీటి కోసం నెమళ్ల తిప్పలు

బాల్కొండ: వేసవి కాలం కావడంలో జాతీయ పక్షి నెమళ్లు నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వరి పంట రక్షణ కోసం రైతులు గుళికలు, క్రిమి సంహారక మందులు చల్లుతున్నారు. ఈక్రమంలో ఆనీటినే తాగి నెమళ్లు మృత్యువాత పడుతున్నాయి. గతంలో చిట్టాపూర్ వద్ద 11 నెమళ్లు, బాల్కొండ మండల కేంద్రంలో నాలుగు నెమళ్లు ఇలాగే మృత్యువాత పడ్డాయి.

